క్లుప్తంగా

పచ్చని పొలాలు నాశనం చేయొద్దు

బొబ్బిలి: బాడంగి దగ్గరలోని పాత ఎయిర్‌స్ట్రిప్ ప్రాంతంలో ఆయుధ సామగ్రి కర్మాగారం, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, అక్కడి పచ్చని పొలాలు నాశనం చేయవద్దని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్నలు కోరారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఆయా నిర్మాణాలు జరిగితే అక్కడి గ్రామ నేల, భూములు కలుషితమవుతాయని, తద్వారా ప్రజలు రోగాల బారినపడే అవకాశం ఉందన్నారు. పాల్తేరు, పిన్నవలస, రామచంద్రపురం, ముగడ, పూడివలస, కోడూరు, మల్లంపేట తదితర గ్రామాల రైతుల దగ్గర నుంచి దాదాపు 1500 ఎకరాల వరకు భూ సేకరణ చేస్తున్నట్లు విషయం తెలిసిందన్నారు. అక్కడి ప్రజల ఇష్టానుసారం నిర్మాణాలు చేపట్టాలని లేకపోతే పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

రేగిడి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు మంగళవారం సందర్శించారు. పెండింగ్‌లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్‌ఐ పి.నీలావతికి ఆయన సూచించారు. అలాగే మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

నిషేధిత పాలిథిన్ సంచుల సీజ్

రాజాం: పట్టణంలోని పలు దుకాణాలు, బడ్డీ కొట్లు, తోపుడు బండ్లల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలువురు తోపుడుబళ్ల వ్యాపారుల వద్ద 10 కిలోల నిషేధిత పాలిథిన్ సంచులను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ సంచులను ఎవరైనా విక్రయించినా, వాడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం పనుల సోషల్ ఆడిట్ (సామాజిక తనిఖీ)పై ప్రజావేదిక కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఏపీవో సాయిరాం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఆడిట్ బృందం తనిఖీల నివేదికలతో హాజరుకావాలని కోరారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, మండలంలో జరిగిన ఉపాధి పనులు, సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధులపై ఈ ఆడిట్ జరిగిందన్నారు.

వడ్డీలో 50 శాతం రాయితీ



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: ఇంటి పన్నుకు సంబంధించి, ఈ నెలాఖరులోగా మొత్తం బకాయిలు చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆమె.. ఇంటి పన్ను వసూళ్లలో కల్పిస్తున్న సబ్సిడీపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం స్థానిక సచివాలయాలను ఆమె సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ



బీఎల్‌వోలకు సూచనలిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

బాడంగి: పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలని బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌వోలతో మంగళవారం సమావేశమైన ఆయన.. ఓటరు గుర్తింపు కార్డులకు ఆధార్ నంబర్లను విధిగా అనుసంధానం చేయాలన్నారు. ఏ పార్టీ నుంచి ఎటువంటి విమర్శలు రాకుండా ఓటర్ల జాబితా తయారీ జరగాలన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దారు సుధాకర్, ఎన్నికల డీటీ శంకరరావు, హెచ్‌డీటీ ధనం తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలు చేయకుంటే చర్యలు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వంటకాలకు సంబంధించి, మెనూ సక్రమంగా అమలు చేయకపోతే చర్యలు తప్పవని ఎంఈవో త్రినాధరావు హెచ్చరించారు. మండలంలోని కుసుమూరు ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, రికార్డులు, హోమ్ వర్కు పుస్తకాలు, చేతిరాత పుస్తకాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం వంటకాలు, తాగునీరు, మరుగుదొడ్లు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో శ్రీకోదండ సీతారామస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. పురోహితులు వేమకోటి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు చేశారు. అనంతరం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా చేపట్టారు.

ఆక్రమణకు గురవుతున్న రాజాంలోని మల్లమ్మ చెరువు





చెరువు గర్భంలోనే ఇలా అక్రమంగా భవన నిర్మాణాలు

చెరువు.. కనుమరుగు!

- ఆక్రమణలో మల్లమ్మ చెరువు
- కబ్జా చేసేసి భవన నిర్మాణాలు
- నిర్మాణానంతరం ప్లాట్లుగా విక్రయాలు
- పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్న ఆక్రమణదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

రాజాం:

పట్టణంలోని మల్లమ్మ చెరువు కనుమరుగవుతోంది. ప్రస్తుతం కబ్జా కోరల్లో చిక్కుకున్న చెరువును కాపాడే నాథుడే కనిపించడం లేదు. దీంతో ఆక్రమణదారులు రెచ్చిపోయి మరీ చెరువు ప్రాంతాన్ని ఆక్రమించుకుంటున్నారు. అక్రమంగా భవనాలు నిర్మిస్తూ వాటిని ప్లాట్లుగా విభజించి, అమ్మేస్తున్నారు. పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా సంపాదించిన దానిలో కొంత అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు కొంత ముట్టజెప్పి, తమ పని కానిచ్చేస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఏది ఏమైనప్పటికీ 32 ఎకరాలకు పైగా ఉండే చెరువు విస్తీర్ణం ప్రస్తుతం 10 ఎకరాలు కూడా లేని పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాడు గుర్రాల చెరువు.. నేడు మల్లమ్మ చెరువు..

ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఒకప్పుడు నాలుగున్నర ఎకరాల విస్తీర్ణం కలిగిన గుర్రాల చెరువు ఉండేది. ఇదే చెరువును అప్పట్లో గుర్రప్ప చెరువుగా పిలిచేవారు. రాజుల కాలంలో రాజాంలోని సంతకు గుర్రాలపై వచ్చే వ్యాపారులంతా తమ గుర్రాలను ఇక్కడి నీటి కొలను(చెరువు)కు తీసుకువచ్చేవారని అందరూ చెబుతుంటారు. ఆక్రమణల్లో చిక్కుకుని ప్రస్తుతం ఈ చెరువు కనిపించకుండా పోయింది. అదే చెరువు పక్కన ఉన్న మల్లమ్మ చెరువుపై ప్రస్తుతం పట్టణంలోని బడాబాబుల దృష్టి పడింది. ఈ చెరువుకు నాలుగు వైపులా పట్టణం విస్తరించి ఉంది. ఓ వైపు ఆర్టీసీ కాంప్లెక్స్, మరోవైపు ప్రధాన రహదారి, ఇంకోవైపు జీఎంఆర్ కేర్ ఆస్పత్రి ఇలా నాలుగు వైపులా పట్టణం విస్తరించి ఉంది. ఇప్పటికే ఈ చెరువును కొద్దికొద్దిగా ఆక్రమించుకుని, చదును చేస్తూ నిర్మాణాలు చేస్తున్నారు. అక్కడి నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేకున్నా విద్యుత్ శాఖ అధికారులు మాత్రం విద్యుత్ మీటర్లు మంజూరు చేయడం, మున్సిపల్ అధికారులు కూడా తాగునీటి సదుపాయం కల్పించడం జరుగుతోంది. చిన్నచిన్న స్థలాలుగా ఆపు చేసుకుని, అనంతరం వాటిని బిట్లు(చిన్న స్థలం)గా ఒక్కో స్థలాన్ని రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలకు కబ్జాదారులు అమ్మేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇదేమీ తమకు పట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు.



చెరువు భాగంలో నిర్మాణానికి చదును చేసిన ప్రాంతం



చెరువు వెనుక భాగంలో ఇలా ముందుకు వస్తూ ఆక్రమణలు

శ్మశానవాటికలో షాపింగ్‌మాల్‌లు..

ఇదే మల్లమ్మ చెరువుకు ఓ వైపున శ్మశానవాటిక ఉండేది. ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక భాగాన ఉండే ఈ శ్మశా నవాటికలో పోలీసులు, మున్సిపల్ అధికారులు అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ స్థలం పూర్తిగా ఆక్రమణకు గురైంది. అదే శ్మశానవాటికలో షాపింగ్‌మాల్‌లు, ఇళ్ల నిర్మాణాలు జోరుగా చేసేస్తున్నారు. వీటిని రాజాం పట్టణంలోని ఉద్యోగులు, వ్యాపారులు అద్దెకు తీసుకోవడం, కొనుగోలు చేయడం చేస్తున్నారు.

చెరువు గట్టుపై రోడ్డు నిర్మాణం..

రాజాంలోని పాలకొండ రోడ్డులో పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు వెలిశాయి. వీటి వెనకనే మల్లమ్మ చెరువు విస్తరించి ఉంది. ఇదే అదునుగా ఆయా సంస్థల యజమానులు చెరువు స్థలాన్ని ఆక్రమించి, తమ నిర్మాణాలను వెనక్కి విస్తరిస్తున్నారు. గతంలో ఇదే చెరువు గట్టుపై ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి డోలపేటకు రోడ్డు నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులు కూడా కేటాయించి, గ్రావెల్ రోడ్డు పనులు కూడా ప్రారంభించారు. ఇంతలోనే కబ్జాదారులు కళ్లు పడడంతో ఆ చెరువు గట్టు కనిపించకుండా పోయింది.

చర్యలు తీసుకుంటాం..

చెరువు ఆక్రమణలపై దృష్టి సారిస్తాం. కబ్జా జరుగుతోందన్న విషయం తమ దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలు తొలగించేందుకు జిల్లా అధికారులకు నివేదికలు పంపిస్తాం.

–ఎస్‌కే రాజు, తహసీల్దారు, రాజాం

ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరుపై విచారణ

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ మజ్జి చిరంజీవి పనితీరుపై మంగళవారం విచారణ చేసినట్లు ఎంపీడీవో శ్యామలా కుమారి తెలిపారు. ఉపాధి హామీ పథకం వేతనదారులను పిలిపించి, సదరు ఏపీవో ఏ విధంగా పనులు చేయిస్తారు.. ఎప్పుడైనా అవినీతికి పాల్పడ్డారా అనే కోణంలో ఆరాతీయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపీవో హరనాథరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఈకేవైసీ నమోదు పూర్తి చేయండి

తెర్లాం: రేషన్‌కార్డు లబ్ధిదారులందరికీ సంబంధించి చేసే ఈకేవైసీ నమోదు పూర్తి చేయాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సీఎస్ డీటీ స్వర్ణలత ఆధ్వర్యంలో రేషన్‌షాపు డీలర్ల సమావేశం మంగళవారం జరిగింది. మండలంలోని అన్ని రేషన్ డిపోల పరిధిలో ఈకేవైసీ నమోదు శతశాతం పూర్తి చేయాలని, ఈకేవైసీ నమోదు చేసుకోని వారికి ప్రభుత్వం బియ్యం నిలిపివేస్తుందన్నారు. అలాగే ప్రతినెలా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బియ్యం తీసుకుని వెళ్లేటప్పుడు తూకం వేసి తీసుకువెళ్లాలన్నారు.

జీడిమామిడి సాగుపై శిక్షణ

రాజాం సిటీ: పిందె దశలో ప్రస్తుతం ఉన్న మామిడికాయల దిగుబడికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజు సూచించారు. మండలంలోని రాజయ్యపేటలో జీడిమామిడి సాగుపై రైతులకు ఒక్కరోజు శిక్షణ మంగళవారం ఇచ్చారు. మామిడి తోటల్లోని కాయలు నిమ్మకాయల సైజులో ఉన్నాయని, తెగుళ్లు ఆశిస్తే ఏసీఫేట్ 1.5 ఎంఎల్, కార్బెండెజిమ్ ఒక గ్రామును లీటరు నీటిలో తీసుకుని బాగా కలిపి పిచికారీ చేయాలన్నారు. నీటి వసతి ఉన్న రైతులు కాయకోత దశకు చేరుకున్నప్పుడు రెండు తడులు పెట్టాలన్నారు. ఫ్రూట్ కవర్లు వాడితే మామిడికాయల నాణ్యత, పరిమాణం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సారా జోలికి పోవద్దు

మెంటాడ: సారా జోలికి ఎవరూ పోవద్దని గజపతినగరం ఎక్సైజ్ సీఐ జె.జనార్ధనరావు సూచించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని లోతుగెడ్డ, ఆంధ్ర గిరిజన గ్రామాల్లో సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. సారా తాగితే అధోగతి పాలవ్వడం ఖాయమని, సారాకు బానిసలైన ఎంతోమంది జీవితాలు మన కళ్లెదుటే నాశనమై ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ సారాకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరెడ్డి పైడిపునాయుడు, పంచాయతీ కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ జనార్ధనరావు

ప్రకృతి వ్యవసాయోత్పత్తులు ఆరోగ్యానికి మేలు

బాడంగి: ప్రకృతి వ్యవసాయోత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీడీవో ఎస్.రామకృష్ణలు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి సాగు పద్ధతులు అవలంబిస్తూ పండించిన కూరగాయలు, ఆకుకూరల విక్రయాలు మంగళవారం చేపట్టారు. సిబ్బంది అంతా వాటిని కొనుగోలు చేసి, ప్రకృతి సాగును ప్రోత్సహించారు. ప్రకృతి సాగులో పంటలు పండించేందుకు రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన, ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందన్నారు.

రూ.30.16 లక్షలకు ఆశీల వేలం ఖరారు

రాజాం సిటీ: మున్సిపాలిటీకి సంబంధించి, రోజువారీ మార్కెట్ ఆశీల వేలం పాట రూ.30,16,500లకు ఖరారైందని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మార్కెట్ కిస్తీకి సంబంధించి, బహిరంగ వేలం మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గతేడాది పాడిన పాటనే ప్రస్తుత పాటగా అధికారులు రూ. 29,39,379లకు వేలం ప్రారంభించారు. ఈ వేలంలో పది మంది సభ్యులు పాల్గొనగా, అత్యధికంగా వంగా గోవిందరావు అనే వ్యక్తి రూ.30,16,500లకు పాడడంతో దీనిని ఖరారు చేశామన్నారు. అలాగే కబేళాకు సంబంధించి గతేడాది ఖరారైన పాటను ఈ ఏడాది ప్రభుత్వ పాటగా రూ.61 వేలకు ప్రారంభించగా దానిని కూడా రూ.64,500లకు వంగా గోవిందరావు దక్కించుకున్నారన్నారు. ఈ మొత్తాలను జీఎస్టీలతో కలిపి పాడడంతో దీనిని ఖరారు చేస్తూ కౌన్సిల్ ఆమోదానికి పంపించనున్నామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.



వేలంలో పాల్గొన్న పాటదారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

సంక్షిప్తంగా...

నవోదయకు పలువురి ఎంపిక

సంతకవిటి: జవహర్ నవోదయ పాఠశాలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో మండలంలోని గోవిందపురానికి చెందిన వారణాసి హితీష్, కాకరాపల్లికి చెందిన వావిలపల్లి వర్షిణి, మండవకురిటికి చెందిన పలిశెట్టి పూర్ణతేజ ఉన్నారు. మంగళవారం విడుదలైన పరీక్ష ఫలితాల్లో వారంతా ప్రతిభ కనబరచడంతో ఎంపికైనట్లు పాఠశాలల సిబ్బంది తెలిపారు.

రేగిడి: మండలంలోని కందిశ గ్రామానికి చెందిన నెల్లి లోహిత్‌కుమార్ జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారని శ్రీకావ్య స్కూల్ కరస్పాండెంట్ కెల్ల మన్మథరావు మంగళవారం తెలిపారు.

రేగిడి: మండలంలోని ఉణుకూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థి నిద్దాన లిఖిల్‌మోహన్ జవహర్ నవోదయకు ఎంపికయ్యాడు.

మరుగుదొడ్ల ప్రారంభం

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ మంగళవారం ప్రారంభించారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.3 లక్షలుతో ఈ నిర్మాణాలు చేపట్టామని, కార్యాలయానికి వచ్చే వివిధ శాఖల అధికారులకు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా గదులు నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కన్వీనర్ కె.సుదర్శనరావు, వైస్ ఎంపీపీలు కె.ఉమామహేశ్వరరావు, పి.సత్యన్నారాయణ, ఎంపీడీవో ఎల్.త్రినాద్ పాల్గొన్నారు.

ఎక్కలదేవతమ్మ జాతర ప్రారంభం

రాజాం: మండలంలోని పొగిరి గ్రామంలో వాకముల్ల, శనపతి కుటుంబాల కులదేవతగా ప్రసిద్ధి చెందిన ఎక్కలదేవతమ్మ జాతర మంగళవారం ప్రారంభమైంది. పండగ సందర్భంగా రెండు రోజుల క్రితమే గ్రామంలోని ఎక్కలదేవతమ్మ గుడి వద్ద ధర్మకర్తలు పందిరి రాట వేసి ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. ఉదయం భక్తులు అమ్మవారికి ముర్రాటలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా అల్లు

బొబ్బిలిరూరల్: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా అల్లు వెంకటరమణను నియమించారు. ఇదే విషయాన్ని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాగర్ మంగళవారం తెలిపారు.

రీసర్వేపై అవగాహన ర్యాలీ

బాడంగి: మండలంలోని వాడాడ గ్రామంలో భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ మంగళవారం చేపట్టారు. ఆర్డీవో రామ్మోహనరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుధాకర్, మండల సర్వేయరు వెంకటరమణ, రీసర్వే డీటీ అప్పలనాయుడులు పాల్గొని, భూముల సర్వే ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. రైతులంతా పొలాల వద్దకు వచ్చి హద్దులు చూపించి సర్వేకు సహకరించాలని కోరారు.

ప్రజారోగ్యమే లక్ష్యం

రేగిడి: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సోహినీరాఘువ్ అన్నారు. మండలంలోని వన్నలి గ్రామంలో 104 వాహనం ద్వారా ప్రజలకు మంగళవారం వైద్యసేవలు అందించారు. గ్రామాలకు కేటాయించిన వారాల్లోనే 104 వాహనం వస్తుందని, 14 రకాల రోగాలకు సంబంధించి నిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు 64 రకాల మందులు అందిస్తామన్నారు. ప్రతిఒక్కరూ 104 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'పీఎం సూర్యఘర్'కు స్థలం కేటాయించండి

బొబ్బిలిరూరల్: పీఎం సూర్యఘర్ పథకానికి సంబంధించి సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయించాలని ఈపీడీసీఎల్ ఏడీ శ్రీనివాసరావు, ఏఈ సాంబశివరావులు కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీనును మంగళవారం కలిసిన వారు.. బొబ్బిలి పట్టణం సహా మండలంలోని అలజంగి, పక్కి, రంగరాయపురం, పిరిడి, గొల్లపల్లి తదితర గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీల ఉచితంగా ఇచ్చే కనెక్షన్ల కోసం స్థలాల అవసరం ఉందన్నారు. ఏడెనిమిది కనెక్షన్లకు సంబంధించి సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు 2.5 సెంట్ల స్థలం కావాలన్నారు. కొన్ని గ్రామాల్లో స్థలాలు ఉంటే మరి కొన్ని గ్రామాల్లో స్థలాలు లేవన్నారు. స్థలాలు లేని చోట స్థలాలు చూపించి అప్పగించాలని కోరారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదు

- మండల సమావేశంలో రెవెన్యూ సిబ్బంది తీరుపై సభ్యుల ధ్వజం

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఏమాత్రం తగదని సభ్యులు మండిపడ్డారు. సమావేశంలో భాగంగా జరిగిన రెవెన్యూ శాఖ సమీక్షలో గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా తీసుకున్న దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోలేదని వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు యలకల శ్రీనివాసరావు, నెయిగాపుల శివరామకృష్ణయ్యలు అన్నారు. తహసీల్దారు కార్యాలయం చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోవడం లేదని, రైతు సమస్యలను చులకనగా చూస్తున్నారని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, ఎంపీటీసీ కరణం సుదర్శనరావులు ఆర్‌ఐ బి.రామారావుపై ధ్వజమెత్తారు. రైతులు సమస్యలతో అల్లాడిపోతుంటే కనీసం తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దార్లు సమావేశానికి హాజరు కాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇదిలా ఉంటే సభ్యుల ప్రశ్నలకు సభకు విచ్చేసిన ఆర్‌ఐ రామారావు సమాధానం చెప్పలేకపోయారు. హౌసింగ్ శాఖపై జరిగిన సమీక్షలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్లకు ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సహాయానికి టీడీపీ నాయకులకు జాబితాలు అందించి, వారి ద్వారా బిల్లులు అందించేలా చర్యలు చేపడుతున్నారని ఏఈ కె.అనంత్‌కుమార్‌పై ఎంపీటీసీ కరణం సుదర్శనరావు, సర్పంచ్‌లు శనపతి సత్యారావు, కాంబోతుల కళావతిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖపై చేసిన సమీక్షలో స్కూల్ కాంప్లెక్స్‌ల సంఖ్య తగ్గడాన్ని సభ్యులు వ్యతిరేకించారు. నీటిపారుదల శాఖ సమీక్షలో తోటపల్లి ఆధునీకరణ ప్రక్రియ రద్దు చేయగా, కొత్తగా ప్రతిపాదలు పంపించామని, కొన్ని పనులకు ఓఅండ్‌ఎం పద్ధతిలో పనులు చేపట్టి సాగునీరందించే చర్యలు తీసుకుంటామని ఏఈ బి.వి.రమణ తెలిపారు. రానున్న ఖరీఫ్‌కు ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా తోటపల్లి ప్రాజెక్టు భాగంలో పనులు చేపట్టాలని, టైలాండ్ ప్రాంతానికి సాగునీరందించాలని సభ్యులు కోరారు. గ్రామాల్లో విద్యుత్ లోవోల్టేజీ సమస్య ఉందని, విద్యుత్ పంపుసెట్లకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా జరగకపోవడంతో పంటలను రక్షించుకోలేకపోతున్నామని సర్పంచ్ గేదెల వెంకటనాయుడు, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ వెల్లడించారు. ఖరీఫ్ ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడంలో వ్యవసాయాధికారులు విఫలమయ్యారని అరసాడ సర్పంచ్ లచ్చుభుక్త సత్యన్నారాయణ విమర్శించారు. అనంతరం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడారు. పాలనా పరమైన అంశాలను ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల దృష్టికి అధికారులు తీసుకువెళ్లాలని, సంక్షేమ పథకాలు అమలు పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ఉండాలని సూచించారు. అధిక సంఖ్యలో ఆదర్శ పాఠశాలల ఏర్పాటుకు నివేదికలు ఇవ్వాలని ఎంఈవోను కోరారు.



విద్యాశాఖపై జరిగిన సమీక్షలో ఎంఈవోకు సూచనలిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

సంతాప తీర్మానం..

సమావేశానికి ముందు మాజీ జెడ్పీ చైర్మన్ పాలవలస రాజశేఖరం సంతాప తీర్మానాన్ని సభ్యులు ప్రవేశపెట్టగా, సభ దానిని ఆమోదించింది. ఈ మేరకు సభ్యులంతా రాజశేఖరం చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. వంగర మండలంలో రాజశేఖరానికి ఎనలేని సంబంధం ఉందని, ఇదే మండలంలోని ప్రతి రాజకీయ నేతకు రాజకీయ భిక్ష పెట్టింది ఆయనేనని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావులు కొనియాడారు. తోటపల్లి ఆధునీకరణ, మడ్డువలస నిర్వాసితుల సమస్యల పరిష్కారం, రుషింగి–కిమ్మి వంతెన నిర్మాణం, విద్య, వైద్య సేవలను వంగర మండలానికి అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాల్లో రాజశేఖరం కృషి మర్చిపోలేనిదన్నారు. సమావేశంలో మండల విప్ తెంటు కుమారి, వైస్ ఎంపీపీలు కిమిడి ఉమామహేశ్వరరావు, పున్నాన సత్యనారాయణ, ఎంపీడీవో లోపింటి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు



సంతకవిటి మండలంలోని మందరాడ–గోవిందపురం రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. అడుగుకో గుంత.. గజానికో గొయ్యి మాదిరి కనిపిస్తోంది. రోడ్డు పూర్తిగా ధ్వంసమై దారి పొడవునా రాళ్లు తేలిపోయి ఉన్నాయి. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని అటువైపుగా వెళ్లే గోవిందపురం, నారాయణరాజపురం, ముకుందపురం, మోదుగులపేట గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి, కొత్తగా రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–సంతకవిటి

ప్లాస్టిక్ నిషేధానికి వినూత్న ఆలోచన






నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ సంచులు వినియోగించరాదన్న నిబంధనల నేపథ్యంలో రాజాంలోని బొబ్బిలి రోడ్డులో ఓ చికెన్ షాపు యజమాని ఇలా వినూత్నంగా ఆలోచన చేశారు. కిలో చికెన్ కొనుగోలుపై రూ.10 తగ్గిస్తామని.. అది కూడా చికెన్ తీసుకువెళ్లేందుకు స్టీల్‌బాక్స్ తెచ్చుకుంటేనే అని.. బోర్డు ఏర్పాటు చేశారు. ఇది చూసిన వారంతా ప్లాస్టిక్ నిషేధానికి తన వంతు కృషి చేస్తున్న సదరు వ్యాపారి కృషిని అభినందిస్తున్నారు.

–రాజాం

ఆస్తిపన్ను పెంపు మానుకోవాలి..



ఆస్తిపన్ను పెంపు నిర్ణయం మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన బొబ్బిలిలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కేంద్రం దగ్గర నుంచి అదనపు రుణం పొందేందుకు ఆస్తిపన్ను పెంపు దుర్మార్గపు ఆలోచన చేయడం సరికాదన్నారు. ఏప్రిల్ నుంచే ఈ పన్ను పెంపు అమలు చేయాలని చూస్తుండడం, ఒకరి దగ్గర అప్పు తెచ్చుకునేందుకు ప్రజలపై శాశ్వతమైన భారం పడేలా నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. పన్ను పెంపు కోసం చేయదలచిన 44 సవరణ చట్టాన్ని తక్షణమే నిలిపివేయాలన్నారు.

–బొబ్బిలి